నాలాలో వ్యర్థ రసాయనాల డంపింగ్

- ఆందోళనకు గురవుతున్న జీడిమెట్ల-బాలానగర్ నాలా పరిసర ప్రాంతాల ప్రజలు
- పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

ప్రజలు వ్యర్థ రసాయనాల డంపింగ్ చేస్తున్న జీడిమెట్ల – బాలానగర్ నాలా

బాలానగర్, జూలై 26 : జీడిమెట్ల–బాలానగర్ నాలాలో వ్యర్థ రసాయనాల డంపింగ్ మొదలైంది. ఇన్నేండ్లు కనిపించకుండా పోయిన రసాయనాల డంపింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం రావడం వలన తిరిగి ప్రారంభమైందని పలు కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారగానే డంపింగ్ చేసే వారికి మంచి అవకాశంగా మారిందని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కూడా వారికి వంత పాడుతున్నారని ఆరోపించారు. వ్యర్థ రసాయనాల డంపింగ్‌ను అరికట్టాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండటం వలన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలానగర్ డివిజన్ పరిధి కళ్యాణ్‌నగర్, సాయినగర్, నాగార్జుననగర్ కాలనీల ప్రజలు వ్యర్థ రసాయనాల డంపింగ్‌తో కండ్ల మంటలు, శ్వాసకోశ సమస్యలు ఎదురుకావడంతోపాటు ముక్కు పుటాలు అదిరేలా రసాయనాల ఘాటు వాసనలు వెదజల్లుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఎన్నిసార్లు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానిక కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు వ్యర్థ రసాయనాల డంపింగ్‌ను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఈ విషయమై పీసీబీ అధికారి రమేశ్‌ను వివరణ కోరగా.. ఈరోజే మా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

నీటి సమస్య లేకుండా చూడాలి

కూకట్‌పల్లి వివేకానందనగర్ జల మండలి నూతన డీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాగప్రియను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు శుక్రవారం ఆమె కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలని, వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని డీజీఎంను కార్పొరేటర్ కోరారు. – మియాపూర్, జూలై 26

రోడ్డు పనుల పరిశీలన

మియాపూర్, జూలై 26: ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని తులసీనగర్‌లో రూ.30లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని, సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్, యాదగిరి, సంగమేశ్, మల్లేశ్, రమేశ్, జనార్దన్, నవీన్, రవికుమార్ పాల్గొన్నారు.

దుర్గంచెరువులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

శేరిలింగంపల్లి, జూలై 26: దుర్గంచెరువులో దూకి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం.. నగరంలోని ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన ఎం.బాలజీ (25) రాయదుర్గం నాలెడ్జి సిటీలోని ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24న ఉదయం ఇంటి నుంచి నాలెడ్జి సిటీలోని కార్యాలయానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గురువారం రాయదుర్గం పోలీసులకు అతడి సోదరుడు శ్రీనాథ్ ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా బాలాజీ సెల్‌ఫోన్ తన కార్యాలయంలోని విడిచివెళ్లినట్లు గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా.. సమీపంలోని మాదాపూర్ ఐటీసీ కోహినూర్ ముందున్న రహదారిపై తిరుగుతూ కనిపించాడు. కాసేపటికే మాదాపూర్ దుర్గం చెరువు కేబుల్‌బ్రిడ్జి వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. దుర్గంచెరువులో గాలించగా శవమై కనిపించాడు. మెడలో ఉన్న ఐడీ కార్డు ఆధారంగా మృతుడు బాలాజీగా పోలీసులు గుర్తించారు. గతకొంత కాలంగా బాలజీ ఓ యువతితో ప్రేమలో ఉన్నట్లు, పెండ్లి చేసుకోవాలని సదరు యువతి ఒత్తిడి చేయడంతో ఇంట్లో చెప్పలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

మానసిక ఒత్తిడితో గృహిణి ..

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 26: కుటుంబ సమస్యలు, మానసిక ఒత్తిడితో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... నెల్లూరి జిల్లా కొలవనాయుడుపల్లికి చెందిన శ్రీధర్‌కు ఈ ఏడాది మార్చిలో హేమసందినితో వివాహం జరిగింది. హేమసందిని (27), శ్రీధర్ దంపతులు నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ.. కేపీహెచ్‌బీ కాలనీలోని 7వ ఫేజ్‌లో నివసిస్తున్నారు. ఆషాఢం కావడంతో నెలరో జుల కిందట భర్త శ్రీధర్ సొంత ఊరికి వెళ్లాడు. భార్య హేమసందిని తన తమ్ముడు హరిబాబు, అమ్మమ్మతో కలిసి ఉంటుంది. ఈనెల 20న రాత్రి ఇంట్లో.. ఓ హెయిర్ ఆయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తమ్ముడు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా ఆమె మరణించింది. కుటుంబ సమస్యలతో తన సోదరి మరణించిందని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అల్లాపూర్, జూలై 26: ఓ ఆటోలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేటుచేసుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ ప్రధాన కూడలి వద్ద ఓ ఆటోలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసు పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు సుమారు 45 ఏండ్ల లోపు ఉండవచ్చని, ఎర్ర రంగు షర్టు, బ్లూరంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, అతడికి సంబంధించి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాక్స్ విధానాలపై ప్రజల్లో అవగాహన తప్పనిసరి

సమావేశంలో పాల్గొన్న ఆర్థిక నిపుణులు

కొండాపూర్, జూలై 26: ట్యాక్స్‌కి సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, సరైన ఆర్థిక ప్రణాళిక ద్వారా పొదుపుతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని స్టెడ్ ఫాస్ట్ బిజినెస్ కన్సల్టింగ్ సీఈఓ, ప్రముఖ ఆర్థిక నిపుణులు మిథిలేష్ సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో స్టెడ్ ఫాస్ట్ బిజినెస్ కన్సల్టింగ్, సీఎఫ్ఓ ఫోరమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలువురు ఆర్థిక నిపుణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... టాక్స్ విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం వర్సిటీ క్యాంటీన్ నుంచి ప్రధాన ద్వారం వరకు ర్యాలీ చేపట్టి.. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్‌నాయక్, బ్రహ్మంగౌడ్ మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ దాడిని భారత సైనికులు ప్రతిఘటించి... దేశానికి ఘన విజయాన్ని అందించారన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శివకృష్ణ, సిద్ధార్థ, చంద్రశేఖర్, పవన్‌కుమార్, సాయి చరణ్‌గౌడ్, స్నేహిత్, కళ్యాణ్, ప్రేమ్‌కుమార్, రంజిత్‌యాదవ్, సాయికుమార్, రామకృష్ణ, సందీప్‌గౌడ్, హరినాథ్, చందన, సృజన, వైష్ణవి, సిరి తదితరులు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 26

ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం 95 శాతం పూర్తి

పరిశీలించిన నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

నిజాంపేట్‌లోని ఎస్ఎన్‌డీపీ నాలాను పరిశీలిస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

దుండిగల్,జూలై 26 :నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఏడాది నిర్మించిన ఎస్ఎన్‌డీపీ నాలా, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను శుక్రవారం మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు. దాదాపు 90కోట్లతో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయన్నారు. ఒకప్పుడు వర్షం పడితే పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. వర్షపు నీరు ఎక్కడా రోడ్లపై నిలువ ఉండకుండా నాల వ్యవస్థ ద్వారా వెళుతున్నాయని పేర్కొన్న ఆమె మిగిలిన పనులు సైతం త్వరలోనే పూర్తి కానున్నాయని తెలిపారు. అదేవిధంగా వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీ, రోడ్ ప్యాచ్ వర్క్స్, వర్షపు నీటి తొలగింపు వంటి సమస్యలపై దృష్టి పెట్టామని, ఎప్పటికప్పుడు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగంపాండు ముదిరాజ్, సురేశ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు తలారి వీరేశ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు వెంగయ్య చౌదరి, తలారి సాయి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైట్ వాటర్ వెంచర్‌లో ఆర్ఎంసీ ప్లాంట్ సీజ్‌కు ఆదేశం

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 26:బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని నిర్మాణాలు చేస్తున్న బడా నిర్మాణ సంస్థలు కాలుష్య నియంత్రణ చర్యలు పాటించడంలేదని డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబురావు జాతీయ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వైట్‌వాటర్ వెంచర్‌లోని ఆర్ఎంసీ ప్లాంట్‌ను వెంటనే సీజ్ చేయాలని, మిగిలిన నిర్మాణ సంస్థలకు పలు సూచనలతో హెచ్చరికలు చేశారు. వివరాల్లోకి వెళితే... బాలాజీనగర్ డివిజన్ పరిధిలో హైరేజ్ బిల్డింగ్స్, విల్లాస్, గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌ల భవనాల నిర్మాణ పనుల్లో భాగంగా బండరాళ్లను పగులగొట్టడం(రాక్‌బ్లాస్టింగ్)తో సమీపంలోని రాజీవ్‌గాంధీనగర్, సప్తార్‌నగర్, జనతానగర్, ఆంజనేయనగర్, మైస్టీక్‌హిల్స్ కాలనీల్లో నివసించే ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము, ధూళితోపాటు శబ్ద కాలుష్యంతో స్థానిక ప్రజలు ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఆయా నిర్మాణ సంస్థలు కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ఫిర్యాదుతో స్పందించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆయా నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్న వెంచర్‌లను పరిశీలించి వివరణ తీసుకున్నారు. పిమ్మట కాలుష్య నియంత్రణ చర్యలు పాటించని వైట్‌వాటర్ వెంచర్‌లో 48 గంటల లోగా ఆర్ఎంసీ ప్లాంట్‌ను సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు, దానికి సంబంధించిన విద్యుత్ కనెక్షన్‌ను తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే హానర్స్, వాసవి, సైబర్‌సిటీ ఒరియాన నిర్మాణ సంస్థలకు పలు సూచనలతో కూడిన హెచ్చరికలు చేసింది. కాలుష్య నియంత్రణ చర్యలు పాటించడంలేదని మరోసారి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని నోటీసులు జారీ చేసింది.

అంతర్గత రోడ్లు పరిశుభ్రతకు నెలవుగా నిలవాలి

జడ్సీ ఉపేందర్‌రెడ్డి

ఇంజినీరింగ్, బయోడైవర్సిటీ అధికారుల సమీక్ష సమావేశంలో జడ్సీ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, జూలై 26: ప్రధాన రహదారులతోపాటు కాలనీల్లో అంతర్గత రహదారులు సైతం పరిశుభ్రతకు నెలవుగా నిలవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితుల నుంచి ముక్కున వేలేసుకునేంత శుభ్రంగా, అందంగా రహదారులను తీర్చిదిద్దాలని, ఇందుకు క్షేత్రస్థాయిలో చేపట్టే పారిశుద్ధ్య చర్యలే అత్యంత ప్రధానమన్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జడ్సీ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని ప్రధాన రహదారిపై మూడు కిలోమీటర్ల మేర నడకతో పరిశుభ్రత చర్యలను పరిశీలించారు. అనంతరం శిల్పా లే అవుట్ ఫ్లైఓవర్‌పై పారిశుద్ధ్య పనులతోపాటు గచ్చిబౌలి, బయోడైవర్సిటీ కూడళ్లను జడ్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీ పరిశ్రమలకు శేరిలింగంపల్లి జోన్ వేదికగా ఉన్నందున ఆ స్థాయిలోనే రహదారుల నిర్వహణ జరగాలని, క్షేత్రస్థాయి సిబ్బంది చేపట్టే చర్యలే ఇందుకు ప్రధానమన్నారు. స్వీపింగ్ అనంతరం వెంటనే చెత్త కుప్పలు తొలగించాలని, ఫ్లై ఓవర్‌లపై మట్టి, ఇసుక, ఇతర వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జడ్సీ ఆదేశించారు. డీసీ స్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారులు క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని, లోటు పాట్లను సవరించుకుంటూ చక్కని పరిసరాలు నెలకొనేలా చూడాలన్నారు. ఆయన వెంట డీసీ రజనీకాంత్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ నగేశ్ ఉన్నారు.

– శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని రహదారులపై ఎక్కడా వర్షపు వరద నీరు నిల్వ ఉండకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. ఇంజినీరింగ్, బయో డైవర్సిటీ అధికారులతో శుక్రవారం మధ్యాహ్నం జోనల్ కార్యాలయంలో జడ్సీ సమీక్ష సమావేశం నిర్వహించారు. రహదారులపై నీరు నిలిచే ప్రాంతాలతోపాటు ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉండేలా రహదారులపై ఏర్పడ్డ గుంతలు, పాదచారుల పుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియంపై పచ్చదనం అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ..రహదారులపై పాత్ హోల్స్‌ను ఎప్పటికప్పుడు పూడ్చి వేయాలని, వరద నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు.ప్రధాన రహదారులతో పాటు సెంట్రల్ మీడియంలో పచ్చదనం, కూడళ్లలో చెట్ల పరిరక్షణను పకడ్బందీగా చేపట్టాలని, పచ్చదనం మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని జడ్సీ తెలిపారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఈఈలు, డీఈలు, బయో డైవర్సిటీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ సేవలు అభినందనీయం

పోస్టల్‌శాఖ ద్వారా బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్ సేవలు, ఆధార్ సేవలు అందించడం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌పార్క్‌లో సనత్‌నగర్ పోస్ట్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో డ్యాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ) కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ..పోస్టల్‌శాఖ అందిస్తున్న సేవలను ఫతేనగర్ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్, ఎస్‌పీఎం గోవిందారావు, భిక్షపతి, శిల్ప, సురేందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. – బాలానగర్, జూలై 26

చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

అల్లాపూర్, జూలై 26: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాముని చెరవు, సున్నంచెరువు, మైసమ్మ చెరువుల నిండా గుర్రపుడెక్క పేరుకుపోయింది. దీంతో దుర్వాసనతోపాటు దోమలు విపరీతంగా పెరిగి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు విజృంభిస్తున్నడడంతో స్థానిక ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముంది. చెరువులో ఎప్పటికప్పుడు గుర్రపుడెక్కను తొలగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో గుర్రపుడెక్క ఏపుగా పెరుగుతుందని వాపోతున్నారు. సున్నం చెరువులోకి బోరబండ ప్రాంతం డ్రైనేజీ నీరు కలుస్తుండడంతో మురికికూపంగా మారింది. అజీజ్‌నగర్,చంద్రగార్డెన్ ప్రాంతాల్లో ఓపెన్‌నాలాలో మురుగునీరు ప్రవహిస్తూ,చెత్త పేరుకుపోయి దోమలు పెరిగిపోతున్నాయి. దోమల నివారణకు వారానికోసారి కూడా ఫాగింగ్ చేయడం లేదని కాలనివాసులు మండిపడుతున్నారు.ఈ విషయంపై ఎంటమాలజీ ఎస్‌సి సంధ్యను వివరణ కోరగా..గుర్రపు డెక్క తొలగించడం తమ పరిధిలోకి రాదని, చెరువుల్లో పేరుకోపోయిన గుర్రపుడెక్కపై దోమలు వృద్ధి చెందకుండా పిచికారి చేయడం,కాలనీల్లో ఫాగింగ్ చేస్తున్నామన్నారు. జీహెచ్‌ఎంపీ ఇంజినీరింగ్ విభాగం వారికి ప్రతిపాదన పంపామని వివరణ ఇచ్చారు. ఇదే విషయమై ఇంజినీరింగ్ విభాగం అధికారిని వివరణ కోరగా...గుర్రపుడెక్క తొలగించడం తమ పరిధిలోని రాదని, ఎంటమాలజీ విభాగం వారు చూస్తారన్నారని చెప్పారు. ఇలా అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో స్థానిక నివాసితులకు శాపంగా మారుతున్నది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కాముని చెరువుతో పాటు ఇతర చెరవుల్లో పేరుకోపోయిన గుర్రడెక్కను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

జడ్సీ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లిజోన్ ఆఫీస్‌లో డీసీలు, అధికారులతో మాట్లాడుతున్న జడ్సీ

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 26: కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. శుక్రవారం జోన్ పరిధిలోని డీసీలు, రెవెన్యూ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. రెవెన్యూ డాకెట్ల వారీగా సిబ్బంది ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, మొండి బకాయిలపై దృష్టి సారించాలన్నారు. ఆస్తిపన్ను పరిధిలోకి రానివాటిని గుర్తించాలని, అవసరమైన చోటా ఆస్తిపన్నును మదింపు చేయాలన్నారు. ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లు బాధ్యతగా పనిచేయాలని, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వందశాతం లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అలాగే ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించి... వర్షాకాలం నేపథ్యంలో రోడ్లపై నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చాలని, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలన్నారు. ఐదు సర్కిళ్ల పరిధిలో 44 సీఆర్ఎంపీ రోడ్లపై సమస్యల పరిష్కారం కోసం 9676265050 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీలు, రెవెన్యూ, ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జీడిమెట్ల ట్రాఫిక్ పెలికాన్ వలంటీర్‌కు సత్కారం

జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పెలికాన్ వలంటీర్(సిగ్నల్ ఆపరేటర్)గా విధులు నిర్వహించి ఇటీవలే బదిలీ అయిన శివకుమార్‌ను సూరారం చౌరస్తాలోని పలువురు వ్యాపారులు శుక్రవారం శాలువాతో సత్కరించారు. సూరారం చౌరస్తాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తూ సిగ్నల్స్ ఉన్నా లేకున్నా ఎండ, వానలో తన ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ ఏడాది కాంట్రాక్ట్ ఉద్యోగం పూర్తి చేసుకొని వెళ్లిపోతున్న సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక వ్యాపారులు అతడి సేవలు గుర్తించి ఘనంగా సన్మానం చేశారు. – దుండిగల్, జూలై 26

పేదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే


సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, జూలై 26 : పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం సాయంతో కార్పొరేట్ దవాఖానలో ఉచితంగా వైద్యం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 70 మందికి సీఎం సహాయనిధి పథకం కింద వైద్య సేవల నిమిత్తం మంజూరైన రూ.24లక్షల ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం తన నివాసంలో లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ఆపదలో ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని, కొండంత అండగా ఉంటుందన్నారు. బాధిత దరఖాస్తుదారులకు వీలైనంత త్వరగా సహాయం అందేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీనివాస్, రాజేందర్, గణేశ్, శ్రీనివాస్, కాశీనాథ్, అనిల్, లక్ష్మీనారాయణ, భాస్కర్, శ్రీధర్‌రెడ్డి, రఘునాథ్, అంకారావు, శ్రీశైలం, నర్సింగ్, నర్సింహ, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆలయానికి ఎమ్మెల్యే రూ.1.50 లక్షల విరాళం

భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీకి చెందిన రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయ విస్తరణ పనుల నిమిత్తం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ రూ.1.50 లక్షల విరాళాన్ని శుక్రవారం తన నివాసంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు అందించారు. తన లక్షతోపాటు కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి రూ.50వేలు కలిపి ఈ మొత్తాన్ని ఇచ్చారు. మియాపూర్ డివిజన్ ప్రగతి ఎన్‌క్లేవ్‌కు చెందిన బీఆర్ఎస్ నేత బాష ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు

కుత్బుల్లాపూర్, జూలై 26: బోనాల పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దూలపల్లిలోని 18వ వార్డులో స్థానిక కౌన్సిలర్ డప్పు కిరణ్‌కుమార్ నేతృత్వంలో అమ్మవారి ఆలయాల వద్ద పలు మౌలిక ఏర్పాట్లు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా బోనాల పండుగను జరుపుకోవాలని కోరారు.

సేవాభావం అభినందనీయం

జగద్గిరిగుట్ట, జూలై 26: సేవాభావంతో విద్యాబోధన సాగించడం అభినందనీయమని కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్ అన్నారు. చైతన్య విద్యానికేతన్ సంస్థ చైర్మన్ శివరాత్రి యాదగిర